సాక్షి ప్రకాశం
మంగళవారం | 3 | జనవరి | 2023



అదనపు వడ్డీ కోసం వేధిస్తున్నాడు

అధిక వడ్డీ చెల్లించాలని ఓ వ్యక్తి ఒత్తిడి చేస్తున్నాడని మహిళ స్పందనలో ఫిర్యాదు చేసింది.

- 8లో..



లారీ ఢీకొని యువకుడు మృతి

ఒంగోలులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30 /21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

వైకుంఠ వాసా.. అఖిలాండ నాయకా..


అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు..వైకుంఠ నిలయుడైన శ్రీమహావిష్ణువు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో సోమవారం ఉత్తర ద్వారాన భక్తజన కోటికి దర్శనమిచ్చారు. వేకువజామునే భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



శ్రీమహావిష్ణువు అలంకారంలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న మార్కాపురం చెన్నకేశవస్వామి



ఒంగోలులోని ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో వేకువజామునే ఉత్తర ద్వార దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



ఒంగోలులో ఉత్తర ద్వారాన భక్తులకు దర్శనమిచ్చిన ప్రసన్న చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తి

న్యూస్‌రీల్

అఫిలియేషన్ గుర్తింపు దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు: ఇంటర్ విద్యకు సంబంధించి డిగ్రీ కాలేజీలు, కోఆపరేటివ్, మోడల్ స్కూలు, సాంఘిక సంక్షేమశాఖ, కస్తూర్బా బాలికా విద్యాలయం, ప్రైవేటు, హైస్కూలు ప్లస్ యాజమాన్యాలు 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ విద్యామండలి అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10వ తేదీ వరకు అవకాశం పొడిగించారని ఇంటర్ మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి పొడిగింపులు ఉండవని, ఆయా యాజమాన్యాలు త్వరగా స్పందించి వారి కళాశాలల్లోని ఇంటర్ విద్యను బోర్డు నుంచి అఫిలియేషన్ పొందేందుకు దరఖాస్తు చేయాలని కోరారు. 2022–23 విద్యా సంవత్సరానికి ఏదైనా కారణం చేత బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్‌కు చెల్లించాల్సిన అఫిలియేషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 4వ తేదీ వరకు అవకాశం కల్పించారని ఆర్ఐవో సైమన్ విక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని కాలేజీ యాజమాన్యాలు వినియోగించుకోవాలన్నారు.

రిటైల్ అవుట్‌లెట్ లబ్ధిదారులను గుర్తించాలి

- ఫిష్ ఆంధ్ర ప్రోగ్రాంపై సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్



ఆక్వా హబ్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: పీఎంఎస్ఎస్‌వై పథకం కింద కో–బ్రాండింగ్ యూనిట్‌లు, ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసేందుకు లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఫిష్ ఆంధ్ర ప్రోగ్రాంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కో బ్రాండింగ్, రిటైల్ అవుట్‌లెట్‌ల ఏర్పాటుకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు కోసం గ్రామాల్లో డీఆర్‌డీఏలోని వీఓల ద్వారా, పట్టణాల్లో మెప్మా సిబ్బంది ద్వారా గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపల వినియోగం, డిమాండ్‌ను సర్వే చేయాలన్నారు. గ్రామ స్థాయిలో లబ్ధిదారులను గుర్తించడంతో పాటు ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని పీడీసీసీ బ్యాంకు సీఈఓ, ఎల్‌డీఎంలకు సూచించారు. సమావేశంలో మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డీపీఓ నారాయణ రెడ్డి, ఎల్‌డీఎం యుగంధర్, ఆర్టీసీ, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెలిగొండ నిర్వాసితుల సమస్యలపై దృష్టి

- సబ్ కలెక్టర్ మాధవన్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం వెల్లడి




మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్, సరళ వందనం

మార్కాపురం టౌన్: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల గ్రామ నిర్వాసితుల గెజిట్‌ను విడుదల చేస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే సంబంధిత పత్రాలు తీసుకుని రావాలని తెలిపారు. మార్కాపురం యూనిట్ కింద సుంకేసుల, కలనూతల, చింతలముడిపి, గుండంచెర్ల, కాటంరాజు తాండ గ్రామాల్లో, కంభం యూనిట్ కింద గొట్టిపడియ, ఆకవీడు, లక్ష్మీపురం, కృష్ణనగర్, రామలింగేశ్వరపురం, సాయిరాంనగర్ గ్రామాల్లో నిర్వాసితుల జాబితా ప్రకటించామన్నారు. ఈనెల 10 నుంచి 12 వరకు 11 ముంపు గ్రామాల్లో హ్యాబిటేషన్ వారీగా అధికారులు నిర్వాసితుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. మొత్తం ఐదు బృందాలతో విచారణ చేయిస్తున్నామని తెలిపారు. ఈ బృందంలో రెవెన్యూ అధికారులైన ఏఎంవీవీ సుభారావు, మంజునాథరెడ్డి, దేవప్రసాద్, శ్రీనివాస్, పార్వతిబాయిలను అర్జీల స్వీకరణకు నియమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్క నిర్వాసితుడికి న్యాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని అందిస్తామన్నారు. అర్హుల జాబితాలు అన్ని గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

చెంతనే రిజిస్ట్రేషన్

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ పారదర్శకంగా, సులువు కానున్నాయి. అవినీతికి తావు లేకుండా క్షేత్రస్థాయిలోనే ఈ ప్రక్రియ జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లను గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసేలా చర్యలు చేపట్టింది. తద్వారా సాదా బైనామాలకు చెక్ పెట్టడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఉపయోగపడుతోంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సేవలపై సచివాలయ సిబ్బందికి పూర్తి స్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో తొలి దశలో 41 సచివాలయాల్లో అమలు చేయనున్నారు. ప్రయోగాత్మకంగా మూడు సచివాలయాల్లో సేవలను ప్రారంభించి ఆ తర్వాత మిగతా వాటిల్లో కొనసాగించేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే స్థానికంగా సేవలు పొందవచ్చు.

- గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి సేవలు
- రీ సర్వే పూర్తయిన గ్రామాలను తొలుత ఎంపిక చేసిన ప్రభుత్వం
- మొత్తం 41 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు సిద్ధం
- తొలి విడతలో మూడు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ
- గ్రామాల వారీగా అవగాహన సదస్సులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఇప్పటి వరకూ ఎలాంటి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలి. అక్కడ దళారుల దోపిడీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో మొత్తం 719 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి స్థిరాస్తి క్రయ, విక్రయాలు, ఇతర లావాదేవీలు అన్నీ ఇక నుంచి సచివాలయాల కేంద్రంగానే చేపట్టేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పట్టింది. మొదటి రెండు దశల్లో 41 సచివాలయాను ఎంపిక చేసింది. ఈ ప్రక్రియ సక్రమంగా జరగాలంటే భూముల రీ సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. రీసర్వే పూర్తయిన మార్కాపురం మండలం శివరాంపురం, జరుగుమల్లి మండలం నర్సింగోలు, సీఎస్‌పురం మండలం మల్లేశ్వరపురాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది ఆగస్టులో ఈ మూడు ప్రాంతాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్స్ ప్రారంభించింది. రెండో దశలో 38 సచివాలయాల్లో సేవలు ప్రారంభించేందుకు గత ఏడాది సెప్టెంబర్లో అనుమతులిచ్చింది. నూతనంగా కేటాయించిన సచివాలయాల్లో ఒక్క టంగుటూరు మండలంలోని ఐదు గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు అందించేందుకు నిర్ణయించారు. టంగుటూరు మండలంలోని టి.నాయుడు పాలెం, మల్లవరప్పాడు, వల్లూరు, మర్లపాడు, ఎం.నిడమలూరు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఒంగోలు మండలంలో రెండు గ్రామాల్లో, మద్దిపాడు, పెదచెర్లోపల్లి, వెలిగండ్ల మండలాల్లో కూడా రెండేసి సచివాలయాలను జిల్లా యంత్రాంగం ఎంపిక చేసేంది. మిగతా 27 మండలాల్లో ఒక్కో గ్రామ సచివాలయం ఎంపికయ్యాయి.

అవగాహనా సదస్సులు..


జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలు అందించే గ్రామ సచివాలయాల సిబ్బందికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చెందిన సబ్ రిజిస్ట్రార్‌లు ఆయా సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా సదస్సులు చేపట్టారు. అటు సచివాలయ సిబ్బందికి, ఆయా గ్రామాల్లోని ప్రజలకు కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిన సచివాలయంలో పంచాయతీ సెక్రటరీకి సబ్ రిజిస్ట్రార్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేస్తూ జీవో విడుదల చేసింది. మొత్తం 41 గ్రామ సచివాలయాల సిబ్బందికి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

సేవలు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందించే సేవలన్నీ ఎంపిక చేసిన సచివాలయాల్లో అందుతాయి. అక్నాలెడ్జ్‌మెంట్ అప్‌డేట్, డేటా ఫీడింగ్, చెక్ స్లిప్, రెగ్యులర్ నంబర్‌కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం,డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్, దస్తావేజు, సెటిల్ మెంట్ దస్తావేజు, దాన విక్రయ, తనఖా, చెల్లు రసీదు, భాగ పరిష్కార రిజిస్ట్రేషన్ రద్దు, మ్యాన్యువల్ ఈసీ,ఆన్‌లైన్ ఈసీ, మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు అందుబాటులోకి వస్తాయి.

జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌లుగా హోదా

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో స్థిరాస్తి క్రయ, విక్రయ రిజిస్ట్రేషన్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి సచివాలయంలో ఒక పంచాయతీ సెక్రటరీకి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించింది. దీంతో చట్ట పరంగా రిజిస్ట్రేషన్లు చేయటానికి వారికి హోదా కల్పించాం. ప్రస్తుతం కేటాయించిన గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు చేయటానికి ఆయా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. తొలివిడతలో కేటాయించిన సచివాలయాల్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.



– సీహెచ్.నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్

అన్ని రకాల సేవలపై అవగాహన కల్పిస్తున్నాం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎన్నిరకాల సేవలు ఉన్నాయో అన్నింటిపై సచివాలయాల్లో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా ఇచ్చిన సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. స్థిరాస్తి క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు మొదలుకొని అన్ని రకాల సేవలు ఏ విధంగా చేయాలి, వాటికి వసూలు చేయాల్సిన ప్రభుత్వ ఫీజులు, చలానాలు తీసుకోవాల్సిన పద్ధతుల గురించి విపులీకరిస్తున్నాం. సాంకేతికపరమైన ఇబ్బందులు రాకుండా ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నాం.

– రమణ కుమార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1, ఒంగోలు

తరగతి గదిలోనే భావిభారత నిర్మాణం

- డీఈవో బి.విజయభాస్కర్



మాట్లాడుతున్న డీఈవో బి.విజయభాస్కర్

ఒంగోలు: తరగతి గదిలోనే భావి భారత నిర్మాణం జరుగుతుందని డీఈవో బి.విజయభాస్కర్ అన్నారు. అగస్త్య ఫౌండేషన్, రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి సంయుక్తంగా స్థానిక డాన్‌బాస్కో స్కూలులో జిల్లాలోని గణితం, విజ్ఞానశాస్త్రం బోధించే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు మేక్ యువర్ ఓన్ ల్యాబ్ పేరుతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి కంటే ఎక్కువ జ్ఞానేంద్రియాలను ఉపయోగించి విద్యార్థి అభ్యసనం సాగించినపుడు అభ్యసనా స్థాయి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుత శిక్షణ ఆధారంగా విద్యార్థులలో నైపుణ్య సాధనకు, విభిన్న ఆలోచనకు దోహదపడే నమూనాల తయారీ, వాటి వినియోగాన్ని కృత్యాధారితం తరగతిగదిలో ప్రదర్శించినపుడు విద్యార్థిలోని జ్ఞానాన్ని వినియోగ స్థాయికి తీసుకువెళ్లగలగడం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థిలో ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసినవారం అవుతామన్నారు. స్వేచ్ఛగా ప్రశ్నించగలిగిన వాతావరణాన్ని తరగతిలో కచ్చితంగా కల్పించిన ఉపాధ్యాయులు విద్యార్థిని భావి భారత ఉత్తమ పౌరునిగా తీర్చినవారవుతారన్నారు. సమయపాలన పాటిస్తూ, ఉపాధ్యాయులు ఈ నైపుణ్యాలను క్షేత్రస్థాయిలో ఉపయోగంలోనికి తీసుకువచ్చి, విద్యార్థిని క్రమశిక్షణా పూరితమైన నైపుణ్య సాధన దిశగా తీసుకువెళ్లగలిగినపుడు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఫలితాలను ఇస్తాయన్నారు. 35 మంది గణిత, 82 మంది విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ నుంచి వచ్చిన శిక్షకులు, రాష్ట్ర పరిశీలకులు జి.ప్రకాష్, సైన్స్ అధికారి టి.రమేష్ పాల్గొని మాట్లాడారు.

ఫేషియల్ యాప్‌ను పునరుద్ధరించాలి

ఒంగోలు: 60 సంవత్సరాల వయస్సు నిండిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను పునరుద్ధరించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్. ప్రభాకరరెడ్డిలు సోమవారం జిల్లా ఖజానా శాఖ అధికారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల 60 సంవత్సరాల నిండి 2022లో రిటైరైన ఎయిడెడ్ ఉపాధ్యాయులు తిరిగి విధుల్లో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున ఈ అవకాశం పునరుద్ధరించాలన్నారు. అదే విధంగా మండల విద్యాశాఖ అధికారుల వద్ద నుంచి వచ్చిన జీతాల బిల్లులను వెంటనే సీఎఫ్ఎంఎస్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు జిల్లా ఖజానాశాఖ అధికారి జగన్నాథరావు కూడా హామీ ఇచ్చారన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

- స్పందన అర్జీలు సకాలంలో పక్కాగా పరిష్కరించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు అలసత్వం లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. స్పందన భవనంలో సోమవారం స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి ప్రత్యేక దృష్టితో సమీక్షిస్తుందని, ప్రతి అధికారి చిత్తశుద్ధితో పక్కాగా స్పందన అర్జీలు పరిష్కరించాలన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీల్లోని సమస్యలు తిరిగి పునారావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్ఓ చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

- కంభం గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్ బాష స్పందనలో కలెక్టర్‌ను కలిసి తాను ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయ్యాయని తనకు ఉద్యోగం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. కంభం, రావిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో వాచ్‌మెన్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో ఏదో ఒకటి కల్పించాలని కోరారు.
- అమ్మనబ్రోలుకు చెందిన ప్రసన్న తన కూతురుకు పింఛన్ రావడం లేదని ఫిర్యాదు చేశారు. 90 శాతంతో సదరమ్ సర్టిఫికెట్ ఉన్నా వేలిముద్రలు పడటం లేదనే కారణంతో పింఛన్ ఇవ్వడం లేదని, పరిశీలించి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- తాళ్లూరుకు చెందిన పెద్దిరెడ్డి స్పందనలో అధికారులను కలిసి తన తండ్రికి స్వాంతంత్ర్య సమరయోధుల కోటాలో భూమి ఇచ్చారని, అయితే ఆ భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై ఆన్‌లైన్ చేశారని తెలుపుతూ అర్జీ అందజేశారు. పరిశీలించి అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

విద్యాభివృద్ధికి వైఎస్ జగన్ కృషి ప్రశంసనీయం

- కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

సింగరాయకొండ: స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని సోమవారం కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎస్ఏ–1 పేపర్ల ప్యాకింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. పాఠశాలల బాత్‌రూమ్స్ క్లీనింగ్ మెటీరియల్స్ జిల్లా సప్లయర్ కార్యాలయానికి చేర్చారని, కాని ఏ పాఠశాలకు ఎన్ని పంపాలో వివరాలు లేవని అందు వలన పాఠశాలలకు క్లీనింగ్ మెటీరియల్ పంపలేదని ఎంఈఓ బీ శివన్నారాయణ సమస్యను కల్పలతారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే డీఈఓ కార్యాలయంతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. కార్యాలయంలో మిగిలిపోయిన విద్యార్థుల యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వెంటనే జిల్లా గోడౌన్‌కు పంపేలా సీఎంఓ కొండారెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కరించారు. కార్యాలయం పచ్చదనంతో నిండి ఉండటాన్ని గమనించి ఇందుకు కృషి చేసిన ఎంఈఓ శివన్నారాయణను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. విద్యావ్యవస్థలో నూతన ఒరవడిని తీసుకుని వస్తున్నారన్నారు. ఆమె వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీహరి, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

వెలుగొండలో ఉత్తర ద్వార దర్శనంలో శ్రీవారు



విష్ణుమయం



మార్కాపురం చెన్నకేశవ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలు సోమవారం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ధనుర్మాస శుద్ధ ఏకాదశి నాడు వైకుంఠం వాకిళ్లు తెరుచుకుంటాయని, గరుడ వాహనధారియైన శ్రీమహావిష్ణువు ముక్కోటి దేవతలతో భువికి దిగివచ్చి దర్శనమిస్తాడని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో వైష్ణవాలయాల్లో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూకట్టారు. ఆలయాలన్నీ నారాయణుడి నామస్మరణతో మారుమోగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు, దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం, గిద్దలూరు తదితర పట్టణాల్లోని ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



వైపాలెంలోని కొప్పులకొండపై పుష్పాలతో రూపొందించిన వెంకటేశ్వర స్వామి



బేస్తవారిపేటలో ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర స్వామి



సింగరాయకొండ : వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



చీమకుర్తిలోని హరిహర క్షేత్రంలో సామూహిక పూజలు



త్రిపురాంతకంలో నగర సంకీర్తనలో పాల్గొన్న భక్త బృందం



ఒంగోలు సంతపేట సాయి మందిరంలో తిరుప్పావై పాశురాలు ప్రవచిస్తున్న మహిళా భక్తులు



పాములూరు మదన వేణుగోపాలస్వామి ఆలయంలో..





ఒంగోలు : శ్రీగిరి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని ఒంగోలు జవహర్ నవోదయ విద్యాసమితి ప్రిన్సిపాల్ టి.జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, చీరాల, అద్దంకి, వేటపాలెం, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కోరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు , చినగంజాం మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్ ద్వారా మాత్రమే డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాలను 5వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధృవపరిచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా గమనించి విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ నెల 31వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీ ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతుందన్నారు.

అదనపు వడ్డీ కోసం వేధిస్తున్నాడు

● పోలీసు స్పందనలో మహిళ ఫిర్యాదు

ఒంగోలు టౌన్: అధిక వడ్డీ చెల్లించాలని గుళ్లాపల్లికి చెందిన మద్దులూరు మోహనరావు అనే వ్యక్తి ఒత్తిడికి గురిచేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన వేమూరి శ్రీవల్లి అనే మహిళ స్పందనలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవల్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మోహనరావు వద్ద కుటుంబ అవసరాల కోసం పలు దఫాలుగా రూ.2,01,100 అప్పు తీసుకున్నానని, ఇప్పటి వరకు వడ్డీతో సహా ఆరు లక్షల రుపాయలు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

చెల్లించానని, అయినప్పటికీ మరో రూ.6 లక్షలు ఇవ్వాలని చెప్పి గతేడాది నుంచి నెలకు రూ.60 వేలు వసూలు చేస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ తన వద్ద ఉన్న రూ.3,26,000 విలువైన నాలుగు గ్రానైట్ వే బిల్లులను నమ్మకంగా సరాఫరా చేయించుకున్న ఒంగోలు శ్రీరాం కాలనీకి చెందిన మల్లికార్జునరావు అనే గ్రానైట్ వ్యాపారి అందుకుగాను రూ.7 వేలు మాత్రమే చెల్లించి మిగతా డబ్బు ఇవ్వకుండా మోసం చేసినట్లు ఒంగోలులోని కరుణా కాలనీకి చెందిన కొమ్ము జయరామ్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించిన ఏఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. చట్ట ప్రకారం విచారణ చేపట్టి న్యాయం చేస్తానని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. పోలీసు స్పందనకు మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయి. డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఐసీఈఆర్ ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

ఒంగోలు టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎస్పీ మలికా గర్గ్ సోమవారం డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



డీజీపకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి

ఒంగోలు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పీసీ అండ్ పీఎన్‌డీ యాక్టు, సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే అంశంపై పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు అధికారులను డీఈఓ బి.విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పాఠశాల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారిని మండలస్థాయికి, మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు మాత్రమే అర్హులన్నారు. పీసీ అండ్ పీఎన్‌డి యాక్టు, సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే అంశంపై వ్యక్తృత్వం, వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు ఉంటాయన్నారు. 5న పాఠశాల స్థాయి పోటీలు, 6న మండల స్థాయి పోటీలు, 7న జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి పోటీలు ఒంగోలులోని డీఆర్‌ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సాయంత్రం 4 గంటలకు జరుగుతాయని చెప్పారు. పూర్తి వివరాలకు డీసీఈబీ కార్యదర్శి 7382797374 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లారీని ఢీకొని యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

ఒంగోలు టౌన్: కిమ్స్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. తాలుకా పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... మధ్యప్రదేశ్ నుంచి చెన్నైకు ఉల్లిపాయల లోడుతో వెళుతున్న లారీని మోటారు బైకు మీద వస్తున్న వేటపాలెం మండలం రామన్నపట్నం గ్రామానికి చెందిన మాచర్ల నాగార్జున(35) కల్వరి టెంపుల్ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగినప్పుడు బైక్‌పై నాగార్జున ఒక్కడే ఉన్నాడు. సమాచారం అందుకున్న తాలుకా ఎస్సై సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పర్చూరు జెడ్పీటీసీ మృతి



కొల్లా గంగాభవానీ



భవానీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామనాథంబాబు

పర్చూరు: గుండెపోటుతో పర్చూరు జెడ్పీటీసీ సభ్యురాలు కొల్లా గంగాభవాని (56) సోమవారం మృతి చెందారు. ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో ఇంటి వద్దనే తుదిశ్వాస విడిచినట్లు భర్త మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్‌బాబు తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నాగులపాలెం సర్పంచ్‌గా పనిచేశారు. భర్త కొల్లా సుభాష్‌బాబు సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేశారు. మామ కొల్లా రామయ్య పర్చూరు తొలి ఎమ్మెల్యేగా పనిచేశారు. కొల్లా సుభాష్‌బాబుకి స్వాతంత్ర్య సమర యోధులు మాజీ మంత్రి దివి కొండయ్య చౌదరి స్వయానా బావ కావడంతో వీరి కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యత ఉంది. ఆమె మృతి పలువురు రాజకీయ ప్రముఖులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పలువురు నాయకులు విచారం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మృతదేహాన్ని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త రావి రామనాథంబాబు సందర్శించి నివాళులర్పించారు.

తాళాలు పగలగొట్టి చోరీ

● 10 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు అపహరణ

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని వైఎస్ఆర్ నగర్‌లో వెల్పుల వెంకటరెడ్డి నివాసంలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఉదయం పొలం పనులకు వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయని, ఇంట్లోకి చూడగా 10 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. టౌటౌన్ ఎస్సై సువర్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.